# పోతనామాత్యుల శ్రీమద్భాగవతము

## ~ గజేంద్ర మోక్షణము ~

శ్రీమన్నామ! పయోదశ్యామ! ధరాభృల్లలామ! జగదభిరామా!
రామా జనకామ! మహో ద్దామ! గుణస్తోమధామ! దశరథ రామా!

ఓ దశరథ రామా! శుభంకర నామా! నీల జలధి శ్యామా! భూమీశ శ్రేష్ఠమా! జగదభి రామా! జనులయొక్క మనోహరుడా! సద్గుణ నిలయమా! శ్రీ రామచంద్రా!

**శా: అన్యా లోకన భీకరంబులు జితాశానేక పానీకముల్**
**వన్యేభంబులు గొన్ని మత్తతనులై వ్రజ్యా విహారాగ తో**
***దన్యత్వంబున భూరిభూధర దరీ ద్వారంబులందుండి సా**
***జన్య క్రీడల నీరు గాలివడి గాసారావగాహార్థమై.**

అతిభీకరముగా కనిపించు అడవి యేనుగులమంద యొకటి మదించిన శరీరాలతో పెద్ద పెద్ద కొండ గుహలనుండీ విహారార్థమై బయటకు వచ్చి గాలిజలమును అనుభవించుటకునూ, నీట మునిగి ప్రీతితో జలక్రీడలను ఆడుకొనుటకునూ ఒక పెద్ద మడుగులో ప్రవేశించినాయి.

ఎక్కడ జూచిన లెక్కకు ~ నెక్కువయై యడవి నడచు నిభయూథములో
నొక్క కరినాథు డెడతెగి ~ చిక్కె నొక కరేణుకోటి సేవింపంగన్.

ఎక్కడ చూచినా లెక్కిించలేనన్ని కుంజర యూథములు అడవి అంతా ఇటు అటు నడచుచుండగా ఒక కరి రాజు మాత్రమూ వానినుండీ విడివడి ఒక

ఆడు యేనుగుల సమూహములో చేరి సరస సల్లాపాలతో వానిచే సేవింపబడుచుండెను.

**తొండంబుల బూరింపుచు ~ గండంబుల జల్లుకొనుచు గళగళ రవముల్**
**మెండుకొన వలుదకడుపులు ~ నిండన్ వేదండ కోటి నీరుంద్రావెన్.**

ఆ కొలనులో ఆ ఏనుగులు తొండములను నీటితో నింపుకొనుచూ~ పరస్పరము చెక్కిళ్ళపై చల్లుకొనుచూ ~ గళ గళ శబ్దములు చేసు కొనుచూ ~ స్థూలమైన కడుపులను నింపుకొనుచు ~ నీటిని త్రాగినవి.

భుగ భుగాయిత భూరి బుద్బుదచ్ఛటలతో గదలుచు దివికి భంగంబు లెగయ భువన భయంకర ఫూత్కార రవమున ఘోర నక్ర గ్రాహ కోటి బెగడ వాల విక్షేప దుర్వార ఝుంఝూనిలవశమున ఘుమ ఘుమావర్త మడరగల్లోలజాల సంఘట్టనంబుల దటీతరులు మూలములతో ధరణి గూలసరసిలోనుండి పొడగని సంభ్రమించి యుదరి కుప్పించి లంఘించి హుంకరించి భాను గబళించి పట్టి స్వర్భాను పగిది నొక్క మకరేంద్రు డిభరాజు నొడిసి పట్టె.

బుడ బుడ ధ్వనులతో పెద్ద పెద్ద నీటి బుడగల ప్రవాహమును కలిగించుచు ~ ఆకాశమునంటునట్లు  అలలను రేపుచూ భువనములకు భయము కలిగించు ఫూత్కార శబ్ధములు చేయుచూ మొసలి సమూహాలు కూడా హడలి పోవుచుండ ~ తోక కదలికలచే ఝుంఝూనిలపు సుడిగాలు ఉద్భవించగా ~ ఆ తాకిడికి ఒడ్డున ఉన్న వృక్షములు సమూలముగా కూలిపోవ~ సరస్సునుండీ కరిరూపాన్ని గాంచి ~ ఊపిరి బిగ బట్టి ~శీఘ్రముగా లంఘించి ~హుంకరించి ~

సూర్యుని కబళించిన రాహువు వలె ~ ఒక మకరేంద్రుడు వచ్చి గజేంద్రుడిని ఒడిసి పట్టుకొనెను.

అలా మకరి కరిని పట్టుకుంటే ~ ఆ కరి వడిగా తప్పించుకుని తన పొడపైన తొండమునెత్తి ఒక్క వేటు వెయ్యగా ఆ మకరి చచ్చినట్లు జలమందు పడి వెంటనే లేచి ఏనుగుయొక్క ముందరి కాళ్ళను గట్టిగా పట్టుకుంది.

**వడి దప్పించి కరీంద్రుడు ~ నిడుదకరంబెత్తి వ్రేయ నీరాటంబుస్**
**బొడ వడ వడగినట్లు జలముల ~ బడి కడువడి బట్టె బూర్వపద యుగళంబుస్.**

ఈ పద్యములో ~ వడి ~ నిడు ~ బొడ ~ వడ ~ వడి ~ అనే పదాలను పోతనగారు వాటి వేగాన్ని స్ఫురింప చేసేందుకు వాడినారు.

పదముల బట్టినం దలకు బాటొక యింతయులేక శూరతన్
మద గజ వల్లభుండు ధృతిమంతుడు దంతయుగాంతఘుట్టనన్
జెదరగ జిమ్మె నమ్మకరిచిప్పలు పాదులు దప్ప నొప్పఅన్
వదలి జలగ్రహంబు కరివాలము మూలము జీరె గోఅలన్.

కరి దిగుచు మకరి సరసికి ~ గరి దరికిని మకరి దిగుచు గరికరి బెరయన్
కరికి మకరి మకరికి గరి ~ భరమన నిట్ల తల కుతలభటు లరుదుపడన్.

మకరి తన కాళ్ళను పట్టుకున్ననూ, ధృతిమంతుడు శూరుడునైన ఆ గజరాజు తప్పించుకుని తన దంతములతో ఆ మకరి ముడుకు చిప్పలను పాదములను పొడిచి పొడిచి చెదరగొట్టగా, ఆ మకరి కరి కాలును విడిచి తోక మూలమును చీల్చెను. కరిని మకరి నీటిలోనికి లాగగి, మకరిని కరి సరస్సు

ఒడ్డునకు లాగగా, ఇట్లు కరి మకరులు పరస్పరము భయముతోనూ, బరువైన మనస్సుతోనూ అతలా కుతలమగుచూ తమ తమ భృత్యులు భయముతో అదిరి పోవునట్లుగా పోరాడుచుండిరి.

**మకరితోడ బోరు మాతంగవిభుని నొ ~ క్కరుని డించిపోవ గాళ్ళురాక**

**కోరి చూచుచుండె గుంజరీయూథంబు ~ మగలు తగులుగారె మగువలకును.**

**జీవనంబు దనకు జీవనంబై యుంట ~ నలవు చలమి నంత కొంత కెక్కి**

**మకర మొప్పె డస్సె మత్తేభమల్లంబు ~ బహుళ పక్ష శీతభాను పగిది.**

మకరితో ఘోరయుద్ధము చేయుచున్న గజరాజు నొక్కనిని విడిచిపోవుటకు కాళ్ళు రాక అక్కడనే ఉండి ఆడు ఏనుగుల బృందము భయముతో చూచుచుండెను. స్త్రీలకు తమ పురుషులయందు సంగముండును కదా! జలమే తనకు జీవనమై ఉండుటచేత, మకరికిస్థాన బలముచే శక్తి సులువు అంతకంతకు ఎక్కువై ధైర్యము కలిగెను. కరికి నిలకడ తప్పి అలసట వచ్చి కృష్ణ పక్ష చంద్రునివలె శక్తి సన్నగిల్లెను.

కరికి శక్తి సన్నగిల్లడముతో మనస్సు కలతచెంది ....

**క: అలయక సొలయక వేసట**

**నొలయక కరి మకరితోడ నుద్దండత రా**

**త్రులు సంధ్యలు దివసంబులు**

**సలిపెస్ బోరొక్క వేయి సంవత్సరముల్.**

అలసిపోవక, మూర్ఛబోవక, విసుగుదలను ప్రవేశింపనీయక ఏనుగు మొసలితో భయంకరముగా దివారాత్ర సంధ్యలలో ఒక్క వెయ్యి సంవత్సరాలు పోరు సలిపెను.

తనబలమును, శత్రుబలమును సరిపోల్చుకుని దీనిని గెల్వలేను సరికదా వ్యథతో కూడిన మనస్సుతో పూర్వ జన్మల పుణ్యఫలముచే కలిగిన దివ్యజ్ఞానము వలన ఇట్లని భావించింది.

**శా: ఏ రూపంబున దీని గెల్తు, నిటమీ దేవేల్పు జింతింతు, నె**

***వ్వారిం జీరుదు,**

**నెవ్వ రడ్డమిక, నివ్వారి ప్రచారోత్తముస్***

***వారింపందగు వార**

**లెవ్వ రఖిల వ్యాపార పారాయణుల్***

**లేరే మ్రొక్కెద దిక్కు మాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్.**

అయ్యో! దీనిని ఏ విధముగా నేను గెల్చెదను? ఇక నేను ఏ దేవుని కొల్చెదను? ఎవ్వరిని పిల్చెదను? ఈ ఆపదలో నాకడ్డపడే వారెవ్వరున్నారు? ఈ జలచర శ్రేష్ఠుని ఎదుర్కొను వారెవ్వరు? నా వంటి దిక్కుమాలిన వారి మొరలను ఆలకించు పుణ్యాత్ములే లేరా? ఎవ్వరైనా ఉన్నచో వారికి మ్రొక్కెదను ~ అని కరి తలపోసెను.

**శా: నానానేకప యూథముల్ వనములోనంబెద్దకాలంబు స**

**న్మానింపస్ దశలక్ష కోటి కరిణీ నాథుండనై యుండి ను**

**ద్దానాంభః పరిపుష్ట చందన లతాంతచ్ఛాయ లందుండ లే**

**కీ నీరాశ నిటేల వచ్చితి భయంబెట్లో కదే ఈశ్వరా!**

అనేకానేకములైన కుంజర యూథములు వనములో నన్ను చిరకాలము నుండీ ప్రభువుగా మన్నించుచుండ అసంఖ్యాకములైన ఆడు ఏనుగులకు నేను నాథుడనై ఉండ అరణ్యమందు దట్టముగా ఉన్న చందనాది వృక్షలతా కుంజముల చల్లని నీడయందు సంతృప్తుడనై ఉండలేక జలక్రీడ కాంక్షతో ఈ మడుగులో నేల జొచ్చితిని? ఈ భయ నివారణమెట్లు జరుగునో కదా! ఈశ్వరా!
ఆ గజేంద్రుడు అలా తనను కాపాడేవారెవరని భాధపడుతూ ఉండగా....

**ఉ: ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై**
**యెవ్వని యందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం**
**బెవ్వ డనాది మధ్యలయు డెవ్వడు సర్వము దానయైన వా**
**డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్.**

క: ఒకపరి జగములు వెలినిడి ~ యొకపరి లోపలికి గొనుచు నుభయము దానై
సకలార్థ సాక్షియగు న ~ య్యకలంకుని నాత్మమూలు నర్థి దలంతున్.

క: లోకంబులు లోకేశులు~ లోకస్థులు దెగినతుది నలోకంబగు పెం
జీకటి కవ్వలనెవ్వం~ డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్.

భావము

ఈ విశ్వమెవ్వని వలన ఉధ్భవించునో ~ ఎవ్వనియందు లీనమై ఉండునో ~ ఎవ్వనియందు లయించునో ~ పరమేశ్వరు డెవ్వడో ~ మూలకారణమైన వాడెవ్వడో ~ ఆది మధ్య అంతములు లేని వాడెవ్వడో ~ సర్వమూ తానై ఉన్న

వాడెవ్వడో ~ అట్టి ఆత్మభవుడైన (స్వయంభువు అయిన) ఈశ్వరునే నేను శరణు వేడుచున్నాను.

లోకములను ఒకమారు తననుండీ ఉద్భవింపజేసి ~ వేరొకమారు తనలోకి తీసుకొనుచూ ~ వెలుపలను ~ లోపలను ~ తానేయై ఉంటూ సర్వమునకు సాక్షియై ఉంటూ ~ నిర్మలుడైన ఆ అత్మమూలుని (పరమాత్మను) నేను ఆసక్తితో ధ్యానిస్తాను.

ఈ లోకములు ~ లోకులు ~ లోకపాలకు లందరూ కూడా అంతమైన పిమ్మట ~ అలోకమైన (లోకము లేవీ లేని స్థితిలో) పెంజీకటికి (శూన్యస్థితిలోని గాడాంధకారము) అవతల ఎవ్వడు ఏకైక పరంజ్యోతి రూపములో ఉండునో వానిని నేను సేవిస్తాను.

**క: నర్తకుని భంగి బెక్కగు ~ మూర్తులతో నెవ్వడాడు మునులుస్ దివిజులుస్**
**కీర్తింప నేరరెవ్వని ~ వర్తనమొరు లెఱుగరట్టి వాని నుతింతుస్.**

**ఆ: ముక్త సంగులైన మునులు దిదృక్షులు**
**సర్వ భూత హితులు సాధుచిత్తు**
**లస దృశ వ్రతాఢ్యులై కొల్తు రెవ్వని**
**దివ్య పదము వాడు దిక్కు నాకు**

**క: కలడందురు దీనులయెడ**
**గలడందురు పరమ యోగి గణముల పాలస్**
**గలడందురన్ని దిశలను**
**గలడు గలండనెడు వాడు గలడో లేడో!**

భావము

నటునివలె అనేకమైన ఆకృతులతో ఎవ్వడు నటించునో ~ ఋషులును ~ దేవతలును ~ ఎవ్వనిని సంపూర్ణముగా కీర్తింపజాలరో ~ ఎవ్వని వర్తనము (చేష్టితములు) గురించి ఎవ్వరును ఎరుంగ జాలరో ~ అట్టి ప్రభువును నేను స్తుతించెదను.

సంగమును వీడిన మునులు ~ దివ్యదర్శన కాంక్షులు ~ సకల ప్రాణికోటి యొక్క హితమును కోరువారు ~ సాధు చిత్తు లు సైన వారు ~ సాటి లేని వ్రతములను ఆచరించుచూ ఎవ్వని దివ్యపాదములను కొల్చెదరో ~ వాడే నాకు దిక్కు.

మకరి కాటు బాధ ఎక్కువై పోవుచుండగా గజేంద్రుడు నిఃస్పృహ జెంది ఇలా అన్నాడు: దేవునికి నా  మొర వినపడలేదా? దీనులయెడల దయగలిగి ఉండునని అందురు కదా! పరమయోగుల చెంతనే ఉండునని అందురు కదా? భగవంతుడు అంతటా ~ అన్ని దిశలనూ ఉండునని చెప్పెదరు కదా! ఉన్నాడున్నాడని అందరూ చెప్పే ఆ భగవంతుడు నిజముగా ఉన్నాడో లేడో? భగవంతుడున్నాడో లేడో అని బాధలో ఉన్నా, ఇంకా ఇలా ప్రార్థిస్తూ ఉన్నాడు గజేంద్రుడు...

**సీ: కలుగడే నాపాలి కలిమి  సందేహింప గలిమిలేములు లేక గలుగువాడు**
**నాకడ్డపడరాడె నలిన సాధువులచే బడిన సాధులకడ్డపడెడు వాడు**
**చూడడే నాపాటు చూపులజూడక చూచువారల గృప జూచు వాడు**
**లీలతో నా మొఱాలింపడే మొరగుల మొఱలుంగుచుదన్ను మొఱగు వాడు**

తే: అఖిలరూపులు దనరూపమైన వాడు
ఆది మధ్యాంతములు లేక యడరు వాడు
భక్త జనముల దీనుల పాలి వాడు
వినడె చూడడె తలపడె వేగ రాడె!

భావము

కలవారు ~ లేనివారు అనే విచక్షణ లేకుండా ~ లేదా కలడో లేడో అను సందేహము లేకుండా విలసిల్లే ఆ భగవంతుడు నాపట్ల లేకుండా ఉండునా? అతని ఉనికిని సందేహింపనేలా? దుష్టుల పాలపడిన సాధువులకు అడ్డుపడు వాడు ~ నాకు అడ్డపడ రాడా? బాహ్య దృష్టితో కాకుండా అంతర్దృష్టితో చూచువారిపై కృపజూపువాడు నా పాట్లను చూడకుండా ఉంటాడా? దీనజనుల మొరలను వినుచు తన్ను తాను మరచువాడు కరుణతో నా మొరను ఆలకింపడా? అన్ని రూపములును తన రూపమైనవాడు ~ ఆది మధ్య అంతములు లేక విలసిల్లే వాడు ~ భక్తులకు దిక్కులేని దీనులకు దిక్కయినవాడు అయినట్టి కరుణామయుడు నా మొర వినడా ~ నాబాధను చూడడా? నాయందు దయ తలచడా? నన్ను కాపాడుటకు ఇంకా రాడేమి?

క: విశ్వకరు విశ్వదూరుని ~ విశ్వాత్మకు విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజుబ్రహ్మప్రభు ~ నీశ్వరునిం బరమపురుషు నే భజియింతున్.

శా: లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్

నీవే తప్ప నితః పరంబెరుగ మన్నింపందగుస్ దీనునిస్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

భావము

విశ్వమును సృష్టించినవాడు ~ విశ్వముచే అంటబడని వాడూ ~ విశ్వమే తానై ఉన్నవాడు ~ విశ్వమును తెలిసివున్నవాడు ~ తానే విశ్వుడును ~ విశ్వము కాని వాడునైన వాడు ~ శాశ్వతుడు ~ జన్మలేనివాడు ~ పరబ్రహ్మ స్వరూపమైన వాడు ~ ఈశ్వరుడు అయిన ఆ పరమ పురుషుని నేను ప్రార్థించెదను.

ఓ భగవంతుడా! నాలో శక్తి అంతయూ నశించినది ~ ఒక్కింతైననూ లేదు ~ ధైర్యము సడలిపోయి ఊగిసలాడుచున్నది ~ ప్రాణములు నిలకడ తప్పినవి ~ మూర్ఛ వచ్చినది ~ శరీరము చివికి పోయింది ~ అలసట ఆవరించింది. నీవే తప్ప నాకు ఇంక ఏదియునూ తెలియదు ~ ఈ దీనుని నీవే ఆదుకొనుట సమంజసము ~ ఓ ఈశ్వరా రావా! ఓ వరాలిచ్చు ప్రభువా! నన్ను కపాడవా? ఓ జగద్రక్షకా! నన్ను రక్షించవా? నా భయమును బాపవా? ప్రభూ!

క: వినుదట జీవుల మాటలు ~ జనుదట చనరానిచోట్ల శరణార్థుల కో
యనుదట పిలిచిన సర్వము ~ గనుదట సందేహమయ్యె గరుణావార్ధీ!

ఉ: ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్ష విపక్ష దూర! కు
య్యో! కవియోగి వంద్య సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వర మనోహర! యో విపుల ప్రభావ! రా
వే కరుణింపవే, తలపవే, శరణార్థిని నన్ను గావవే!

భావము

ఓ కరుణాసాగరా! ప్రాణుల పిలుపులు నీవు వింటావట! ఆర్థులను రక్షించుటకు ~ నీవెవ్వరును పోలేని చోట్లకైననూ పోతావట! శరణార్థులు పిలిచిన వెంటనే ఓ అని పలుకుతావట! అంతయునూ వీక్షించుచు సర్వమునూ గ్రహిస్తావట! కానీ ఇది అంతయూ నిజమేనా అని సందేహము కలుగుతున్నది స్వామీ!

ఓ కమలప్రియా! ఓ వరదాతా! శత్రువులయందును శత్రుత్వము లేని దయామయా! కుయ్యో! ఓ కవుల చేతను యోగుల చేతను ఆరాధింపబడు స్వామీ!
ఓ సుగుణోత్తమా! శరణాగతులకు కల్పవృక్షమైన వాడా! ఓ మునిమానసచోరా!
ఓ అనంత ప్రభువా! రావా! నన్ను కరుణింపవా! నా అర్తిని గురించి తలంపవా!
శరణార్థినైన నన్ను కావవా?
అలా గజేంద్రుడు మొరబెట్టుకుంటూ ఉంటే*

**ఆ: విశ్వమయత లేమి వినియు నూరకయుండి**
**రంబుజాసనాదు లడ్డపడక**
**విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు**
**భక్తి యుతునకడ్డపడ దలంచి**

గజేంద్రుని మొరను వినియును బ్రహ్మాది దేవతలు తమకు సర్వశక్తిమంతత్వము లేక అడ్డుపడక ఊరకుండిరి. కానీ విశ్వమంతటనూ

వ్యాపించియున్న విభుడైన విష్ణువు జిష్ణువు (జయశీలుడు) భక్తియుతుడైన కరిరాజును రక్షింపదలచిన వాడై....

**మ: అల వైకుంఠపురంబులో నగరిలో నా మూల సౌధంబు దా**
**పలు మందార వనాంత రామృత సరః ప్రాంతేందు కాంతోపలో**
**త్పల పర్యంక రమా వినోది యగు నాపన్న ప్రసన్నుండు వి**
**హ్వల నాగేంద్రము "పాహి పాహి" యన గుయ్యాలించి సంరంభియై.**

అక్కడెక్కడో ఉన్న వైకుంఠధామములో ~ దూరముగా ఉన్న సౌధమునకు ఆవలనున్న మందార వనములోని అమృత సరోవర ప్రాంతమున చంద్రకాంత శిలలతోను ~ కలువలతో అమర్చబడిన శయ్యపై లక్ష్మీదేవితో వినోదించుచున్న ఆపన్న ప్రసన్నుడు ఆపదలోనున్న వారి పట్ల అనుగ్రహము జూపువాడు ~ భయకంపితుడైన గజేంద్రుడు "పాహి పాహి" అని మొరపెట్టుచుండగా ఆ ఆర్తనాదాన్ని విని అతి శీఘ్రముగా....

**మ: సిరి కింజెప్పడు శంఖ చక్ర యుగముం జేదోయి సంధింప డే**
**పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డా కర్ణికాం**
**తర ధమ్మిల్లము జక్క నొత్తడు వివాద ప్రోత్థిత శ్రీకుచో**
**పరిచేలాంచలమైన వీడడు గజ ప్రాణవ నోత్సాహి యై.**

**మ: తన వెంటస్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతముస్, దాని వె**
**న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధనుః కౌమోదకీ శంఖ చ**
**క్రనికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వచ్చి రో**
**య్యన వైకుంఠపురంబునం గలుగు వా రాబాల గోపాలముస్.**

గజేంద్రుని ప్రాణాలను రక్షింపవలెనను ఉత్సాహము ఉరకలు వేస్తుండగా ఆ శ్రీహరి, శ్రీదేవికైననూ చెప్పడు. శంఖ చక్రములనైననూ చేతులలో ధరింపడు ~ అనుచరులను ఎవ్వరినీ పిలువడు ~ పక్షిరాజైన గరుడుని సిద్ధపడమని చెప్పడు ~ చెవుల వరకూ జాలువారిన జుత్తునైననూ సవరించుకొనడు ~ అంతే కాదు ~ తన వ్రేళ్ళకి చుట్టుకున్నట్టి ~ ప్రణయకోపముతో లేచి వెళ్ళి పోవుచున్న ~ శ్రీదేవి యొక్క పైటచెంగు కూడా విడిచిపెట్టకుండా అట్లే లేచి వడి వడిగా ఆకాశమార్గాన
నడచి వెళ్ళి పోవు చుండగా....

శ్రీహరి వెంట శ్రీదేవి, ఆమె వెంట అంతఃపుర స్త్రీజనము, వారివెంట గరుడుడు, ఆతని ప్రక్కనే ధనుస్సు, గద, శంఖ చక్రాది పరికరాలు, వానివెంట నారదుడు, విష్వక్సేనుడు బయలుదేరగా ~ వారివెంట రయ్యిమని వైకుంఠములోని ఆబాలగోపాలమూ వెంటబడిరి. గోవిందుని కరకమలములో చిక్కుబడి లాగబడుచున్న తన పైటచెంగుని రక్షించుకొనుచూ ఆయన వెంట పరుగెత్తవలసి వచ్చిన లక్ష్మీదేవి ఇట్లు తలపోసింది.

**మ: తన వేంచేయు పదంబు బేర్కొన డనాథ స్త్రీజనాలాపముల్**
**వినెనో మ్రుచ్చులు మ్రుచ్చిలించిరొ ఖలుల్ వేద ప్రపంచంబులస్**
**దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో భక్తులం**
**గని చక్రాయుధుడేడి చూపు డని ధిక్కారించిరో దుర్జనుల్.**

స్వామి తాను వెళ్ళుచున్న దెచ్చటికో ఎందులకో ~ చెప్పకుండా ~ ఇంత వడివడిగా వెళ్ళుచుండెనేల? ఎవ్వరైనా అనాథ స్త్రీజనుల ఆర్తనాదములు

వినెనేమో! దుర్మార్గులైన చోరులేమైనా దొంగిలించిరో, లేక దుష్టులెవ్వరైనా వేదాలను అపహరించిరో? రాకాసి మూకలు దేవతల నగరముపై దండెత్తిరో? దుర్జను లైన  దైవద్వేషు లెవరైనా "విష్ణువేడీ? చూపండి" అని భక్తులను ధిక్కరించి హింసింపుచుండిరేమో? అని తర్కించు కొనుచూ నా సిరుల సుందరి....

**శా: తాటంకాచలనంబుతో భుజ నట ద్ధమ్మిల్ల బంధంబుతో**
**శాటీ ముక్త కుచంబుతో న దృఢచంచత్కాంతితో శీర్ణలా**
**లాటా లేపముతో మనోహర కరాల గ్నో త్తరీయంబుతో**
**గోటీందు ప్రభతో నురోజ భర సంకోచ ద్విలగ్నంబుతోన్.**

**క: అడిగెద నని కడు వడి జను**
**నడిగిన దను మగుడ నుడుగడని నడ యుడుగున్**
**వెడవెడ చిడిముడి తడ బడ**
**నడు గిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్.**

కదలాడు చెవికమ్మల తోనూ ~ ముడిపేయబడిన శిరోజములతోనూ ~ ఆచ్ఛాదన తొలగిన కుచములతోనూ ~ మారుచున్న ముఖ కాంతితోనూ ~ కుంకుమ చెదిరి లేపనములు వెలిసిన ముఖముతోనూ ~ మనోహరుని చేతిలో చిక్కుకున్న  ఉత్తరీయముతోనూ ~ కోటి చంద్రుల శోభతోనూ ~ కుచభారముతో వంగిన వక్షముతోనూ ~ ఆమె శ్రీహరిని అనుసరించుచూ ఎక్కడికి ఎందుకీ దౌడు అని అడుగవలెనని వడి వడిగా నడుచుచూ~ అడిగినా

చెప్పుడేమో అని సంకోచించుచూ అడుగక ఊరుకొనుచూ ~ చిరుకోపము తెచ్చుకొనుచూ వడి తగ్గించి మందగమనమును చేయుచూ ఆ దేవి పతిదేవుని వెంట నడచుచుండెను.

అలా మహావిష్ణువు వెంట అందరూ వెంట వస్తూ ఉంటే ~ ఎందుకు, ఎక్కడికి పోతున్నడో తెలియక కలవరప డుతుంటే ...

**మ:విను వీథిం జను దేర గాంచి రమరుల్ విష్ణుస్ సురారాతి జీ**
**వన సంపత్తి నిరాకరిష్ణు గరుణావర్ధిష్ణు యోగీంద్ర హృ**
**ద్వన వర్తిష్ణు సహిష్ణు భక్త జన బృంద ప్రాభవాలంకరి**
**ష్ణు నవోఢోల్లసదిందిరాపరిచరిష్ణుస్ జిష్ణు రోచిష్ణునిస్.**

**మ: చనుదెంచెస్ ఘను డల్లవాడె హరి పజ్జంగంటిరే లక్ష్మి శం**
**ఖనినాదం బదె చక్రమల్లదె భుజంగ ధ్వంసియుస్ వాడె క్ర**
**న్నన నేతెంచెనటంచు వేల్పులు 'నమో నారాయణాయేతి' ని**
**స్వనులై మ్రొక్కిరి మింట హస్తి దురవస్థావక్రికిం జక్రికిస్.**

అసురుల జీవితములను అంతము చేయువాడు ~ కరుణాసాగరుడు ~ యోగీంద్రుల హృదయసీమలందు విహరించువాడు ~ సహనశీలి ~ భక్తజనుల హృదయాలను ఉత్కృష్ట పరచువాడు ~ నిత్యనవ యౌవని అయిన ఇందిరాదేవికి పరిచర్యలు చేయువాడు ~ జయశీలుడు ~ తేజోమయుడు అగు

విష్ణుమూర్తి ఆకాశవీథులలో వస్తుండగా దేవతలు చూచి .... అడుగో విష్ణువు వస్తూ ఉన్నాడు ~ ఆ వెను వెంటనే లక్ష్మీదేవి అమ్మ గారు కూడా వస్తున్నారు

చూచారా? అదుగో శంఖారావము ~ సుదర్శన చక్రము ~ అదుగో గతుత్మంతుడు కూడా వస్తున్నారు.

**మ: కరుణా సింధుడు శౌరి వారి చరముస్ ఖండింపగా బంపె స**

**త్వరితా కంపిత భూమి చక్రము మహోద్య ద్విస్ఫులింగచ్ఛటా**

**పరిభూతాంబర శుక్రముస్ బహు విధ బ్రహ్మాండ భాండచ్ఛటాం**

**తర నిర్వక్రము బాలితాఖిల సుధాంధ శ్చక్రముం జక్రముస్.**

కరుణాసాగరుడైన శ్రీహరి మకరిని ఖండించుటకు సాధుజనుల రక్షించు తన సుదర్శన చక్రమును పంపెను. భూమండలాన్ని కంపింపజేయగల వేగము గలది, తననుండీ వెలువడే అగ్ని కణాలతో ఆకాశాన్ని చుట్టివేయగలది ~ బ్రహ్మాండభాండాలను కాంతిపుంజములతో నింపివేయగలది ~ తిరుగు లేనట్టిదీ అయినది, ఆ మకరి తలను త్రుంచివేసింది ఆ సుదర్శన చక్రము.

**శా: భీమంబై తలద్రుంచి ప్రాణముల బాపెం జక్ర మాశుక్రియస్**

**హేమక్ష్మాధర దేహముం జకిత వన్యేభేంద్ర సందోహముస్**

**గామ క్రోధన గేహముస్ గరటి రక్త స్రావ గాహంబు ని**

**స్సీమోత్సాహము వీతదాహము జయశ్రీమోహముస్ గ్రాహముస్.**

**క: మకరమొకటి రవి జొచ్చెను**

**మకరము మఱియొకటి ధనదుమాటున డాగెస్**

**మకరాలయమున దిరిగెడు**

**మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెస్.**

ఆ చక్రము మేరుసమాన దేహము గలదియు, ఏనుగుల గుంపు చకితమై చూస్తూ, కామక్రోధాలకు నిలయమును, కరిరాజు రక్తస్రావముతో నిండిన మడుగులో మునిగి అంతు లేని ఉత్సాహముతోను, విజయ కాంక్షతో ఉన్న మకరిని త్రుంచివేసింది. ఒక మకరము సూర్యమండలములోనికి వెళ్ళింది ~ ఇంకొకటి(నవనిధులలో ఒకటైనది) ధనదుని ( సంపదలకు నిలయమైన వాడు కుబేరుడు) వెనుక దాగింది. సాగరములో తిరుగు మకరాలన్నీ భయపడి కూర్మరాజును (కూర్మావతారము) శరణు జొచ్చెను.

**శా: పూరించెన్ హరి పాంచజన్యము గృపాంభోరాశి సౌజన్యమున్**
**భూరిధ్వాన చలాచలీ కృత మహా భూత ప్రచైతన్యమున్**
**సారోదారసిత ప్రభా చకిత పర్జన్యాది రాజన్యమున్**
**దూరీభూత విపన్న దైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్.**

**మ: మొరసెన్ నిర్జర దుందుభుల్ జలరుహామోదంబులై వాయువుల్**
**దిరిగెన్ బువ్వుల వానజల్లు గురిసెన్, దేవాంగనాలాస్యముల్**
**పరగెన్ దిక్కులయందు జీవ జయఖేల ధ్వానముల్ నిండె సా**
**గర ముప్పొంగె దరంగ చుంబిత నభోగంగా ముఖాంభోజమై.**

శ్రీహరి పాంచజన్యాన్ని శంఖాన్ని పూరించినాడు. దేవదుందుభులు మ్రోగినాయి ~ వాయువులు వీచినాయి ~ పూలవాన జల్లు కురిసింది ~ అప్సరసలు నృత్యాలు చేసినారు ~ అలలు ఆకాశమునంటునట్లుగా సముద్ర ముప్పొంగింది ~ జయ జయ ధ్వానాలతో దిక్కులు నిండినాయి.

**క: నిడుదయగు కేల గజమును**

**మడువున వెడలంగ దిగిచి మదజలరేఖల్**

**దుడుచుచు మెల్లన పుడుకుచు**

**నుడిపెన్ విష్ణుండు దుఃఖ మూర్వీ నాథా!**

పొడపైన తొండాన్ని పట్టుకొని శ్రీహరి గజేంద్రుని మడుగు నుండీ వెలికిదీసి చెక్కిళ్ళపై కారిన మదజల రేఖలను తుడిచి చేతితో నిమురుచూ దాని బాధనూ దుఃఖాన్ని బాపెను.

**క: బాలా నావెనువెంటను ~ హేలన్ వినువీథి నుండి యేతెంచుచు నీ**

**చేలాంచలంబు బట్టుట ~ కాలో నేమంటి నన్ను నంభోజముఖీ!**

**క: దీనుల కుయ్యాలింపను**

**దీనుల రక్షింప మేలుదీవన బొందన్**

**దీనావన! నీ కొప్పును**

**దీన పరాధీన! దేవదేవ! మహేశా!**

బాలా! నీ పైటచెంగును చేతితో పట్టుకొని విడువకుండా ఆకాశమార్గాన నేను విలాసముగా వెళ్ళిపోతూంటే నీవు నావెంట పరుగెత్తుకుంటూ వచ్చినపుడు నీవు నా గురించి ఏమనుకొంటివో కదా! అని అడగ్గా, అమ్మగారు .. ఓ ప్రభూ! దీనపరాధీనా! దీనులయొక్క మొరల నాలకించుటకునూ వారిని రక్షించుటకు వారి స్తుతులను పొందుటకు నీకే తగిన అధికారం ఉంది కదా! అని పలికింది.

క: గజ రాజ మోక్షణంబును ~ నిజముగ బఠియించునట్టి నియతాత్ములకున్
గజ రాజ వరదుడిచ్చును ~ గజ తురగ స్యందనములు గైవల్యంబున్.

ఈ గజేంద్ర మోక్షణ కథను శ్రద్ధగా చదివిన నిష్ఠాపరులకు కరిరాజ వరదుడు (శ్రీహరి) రథ గజ తురగాది సకల సంపదలే కాక కైవల్యమును కూడా ప్రసాదించును.

~~ ఇంతటితో పోతనామాత్యుల వారి శ్రీమద్భాగవతములోని ముఖ్యమైన పద్యాలతో కూడిన గజేంద్ర మోక్షణ ఘట్టము సమాప్తము~~

**~(సేకరణ: పి. యల్. నరసింహాచార్య దాసస్)~**